క్లుప్తంగా

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ముషీరాబాద్: విద్యానగర్‌లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపకులను నియమించడానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుకన్య దరఖాస్తులను ఆహ్వానించారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 24న సాయంత్రం 5 గంటల లోపు కళాశాల ఆఫీసులో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ నెల 25వ తేదీ ఉదయం 10 గంటలకు అభ్యర్థులకు ఇంటర్వ్యూ ఉంటుందని తెలిపారు. ఇంగ్లీష్–4, సంస్కృతం –1, చరిత్ర–1, రాజనీతి శాస్త్రం–1, వాణిజ్యాశాస్త్రం–2, బీబీఏ–2, గణితశాస్త్రం–1, డెటా సైన్స్–1, కంప్యూటర్ సైన్స్, అప్లికేషన్స్–7 మొత్తం 20 పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. పీజీలో కనీసం 55 శాతం మార్కులు(ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం), సంబంధిత సబ్జెక్టుల్లో పీహెచ్‌డీ కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఇంటర్వ్యూలు జరిగే ఖైరతాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో 25వ తేదీ జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు.

టీటీడీలో తెలంగాణ వారికి ప్రాధాన్యత కల్పించాలి


టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని కలిసిన ఆర్.కృష్ణయ్య, రాజ్‌కుమార్ తదితరులు

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్రానికి చెందిన బీసీ నాయకులకు టీటీడీ పాలక మండలిలో ప్రాధాన్యత కల్పించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ రాజ్‌కుమార్ కోరారు. ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్యతో కలిసి రాజ్‌కుమార్ టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువుల పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానంలో పాలక మండలి సభ్యత్వంలో తెలంగాణ వారికి ప్రాతినిధ్యం తక్కువగా ఉందన్నారు. జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందకిషోర్, తదితరులు పాల్గొన్నారు.

సంతోష్ సేవలు చిరస్మరణీయం



కాచిగూడ: బీజేపీ కాచిగూడ డివిజన్ అధ్యక్షుడు బండారు సంతోష్ కుమార్ సంస్మరణ సభ గురువారం జరిగింది. సంతోష్ కుమార్ ఇటీవల గుండెపోటుతో మరణించిన సంగతి విదితమే. ఈ సందర్భంగా బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతం రావు, కోశాధికారి ఎ.సూర్యప్రకాష్ సింగ్, కె.నర్సింగ్ యాదవ్, యశ్వంత్‌లు సంతోష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బీజేపీ నేతల హౌస్ అరెస్ట్


బాగ్‌అంబర్‌పేటలో హౌస్‌అరెస్టులో కార్పొరేటర్ పద్మ వెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: బీజేపీ నేతలను పోలీసులు ఎక్కడికక్కడ హౌస్ అరెస్టులు చేశారు. బీజేపీ రాష్ట్ర నాయకత్వం చేపట్టిన డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లపై బీజేపీ పోరుబాట నిరసన కార్యక్రమానికి వెళ్తున్న బీజేపీ నాయకులను గురువారం పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో కార్పొరేటర్ పద్మవెంకట్‌రెడ్డి, పార్టీ గద్వాల జిల్లా ఇన్‌ఛార్జ్ బి.వెంకట్‌రెడ్డి, భరత్‌నగర్‌లోని పార్టీ సెంట్రల్ జిల్లా అధికార ప్రతినిధి ఎడెల్లి అజయ్‌కుమార్‌లను అంబర్‌పేట పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. బీజేపీ నేతలు పోరుబాటకు వెళ్లకుండా అంబర్‌పేట ఇన్‌స్పెక్టర్ అశోక్ ఎక్కడికక్కడ కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు.

మహ్మద్ తన్వీర్‌కు శుభాకాంక్షలు



అంబర్‌పేట: రాష్ట్ర ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న మహ్మద్ తన్వీర్‌కు బీఆర్‌ఎస్ అంబర్‌పేట నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ ఎడ్ల సుధాకర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మహ్మద్ తన్వీర్ దివంగత మాజీ మంత్రి ఫరీదుద్దీన్ కుమారుడు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు జనార్ధన్, రాహుల్, మహేష్ తదితరులు ఉన్నారు.

అరుంధతినగర్‌లో మోకాలిలోతు నీరు


అరుంధతినగర్ బస్తీలో మోకాలిలోతు నీరు చేరిన దృశ్యం

చిక్కడపల్లి : గాంధీనగర్ డివిజన్ అరుంధతినగర్ బస్తీలో వర్షాలకు మోకాలిలోతు నీరు చేరింది. గురువారం ఆరు గంటల సమయంలో బస్తీలో ఒక్కసారింగా మోకాలిలోతు నీరు చేరవడంతో బస్తీ ప్రజలకు బస్తీలోకి రావడానికి బయటకు వెళ్ళడానికి నానా ఇబ్బందులు పడ్డారు.

గత వేసవిలో కూడా వర్షాలు కురిసిన సందర్భంలో కూడా ఇదే పరిస్థితి ఏర్పడింది. నాలా ప్రహరీ నిర్మాణంలో భాగంగా మట్టిని నాలా గోడ వెంట గుట్టలుగా పోయడంతో వరదనీరు నాలాలోని పోకుండా ఆగిపోవడంతో బస్తీలోని ఇండ్ల ముందు నీరు చేసింది. ఇప్పటికైనా ఎమ్మెల్యే కార్పొరేషన్ స్పందించి గోడ వెంట ఉన్న గంటలకొద్ది మట్టిని తొలగించి వరదనీరు సాఫీగా నాలాలోని వెళ్ళేలా చర్యలు తీసుకోవాలని బస్తీ సంక్షేమసంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు.

కూలిన చెట్టును తొలగించిన డీఆర్‌ఎఫ్ సిబ్బంది

చిక్కడపల్లి: మూడు రోజులుగా వర్షం కురుస్తుండంతో గాంధీనగర్ డివిజన్‌లోని హరిత అపార్ట్‌మెంట్‌లో గురువారం ఓ చెట్టు కులిపోయింది. స్థానికులు ఎమ్మెల్యే ముఠాగోపాల్ కు ఫిర్యాదు చేయడంతో ఆయన స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. డీఆర్‌ఎఫ్ సిబ్బంది చెట్టు కొమ్మలను తొలగించారు. దీంతో స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి తుడుం లక్ష్మీ, బాబన్న తదితరులు పాల్గొన్నారు.


కులిన చెట్టును కొమ్మలను తొలగింప చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, డీఆర్‌ఎఫ్ సిబ్బంది

పటేల్‌నగర్‌లో పొంగిపొర్లుతున్న నాలాలో చెత్తను తీసివేయిస్తున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్ గౌడ్



పొంగిపొర్లిన నాలాలు

అంబర్‌పేట: కురిసిన భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. నాలాలు పొంగిపొర్లాయి. గురువారం ఏకధాటిగా వర్షం కురవడంతో జనజీవనం స్తంభించిపోయింది. మోయిని చెరువు నాలా, ఉస్మానియా యూనివర్శిటీ నాల వర్షపు నీటితో నిండిపోయింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

ఒరిగిపోయిన చెట్టు



ముషీరాబాద్: రాంనగర్ డివిజన్ బాకారంలో భారీ చెట్టు గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పూర్తిగా ఒంగిపోయి పక్కనే ఉన్న విద్యుత్ స్తంబం, ఇళ్లపై పడింది. దీంతో స్పందించిన రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ కె.రవిచారి ఎమర్జెన్సీ స్క్వాడ్‌కు ఫోన్ చేసి ఒరిగిన వృక్షాన్ని తొలగింపజేశారు.

బీజేపీ నేత సంతోష్‌కు కేంద్రమంత్రి నివాళి

కాచిగూడ: బీజేపీ కాచిగూడ డివిజన్ అధ్యక్షుడు స్వర్గీయ బండారు సంతోష్ కుమార్ సంస్మరణ సభ గురువారం జరిగింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి సంతోష్ చిత్రపటానికి పూలువేసి నివాళులర్పించారు. సంతోష్ పార్టీకి అందించిన సేవలను మంత్రి కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు డాక్టర్ ఎస్.గౌతంరావు, బి.వెంకట్‌రెడ్డి, కన్నె రమేష్ యాదవ్, కార్పొరేటర్లు బి.పద్మా వెంకట్‌రెడ్డి, సుభాష్ పటేల్, ఎ.అజయ్‌కుమార్, ఎ.సూర్యప్రకాష్ సింగ్ పాల్గొన్నారు.


బీజేపీ నేత సంతోష్‌కు నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి

ఘనంగా బ్యాంక్ ఆఫ్ బరోడా వ్యవస్థాపక దినోత్సవం


కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు, సిబ్బంది

చిక్కడపల్లి: వివేక్‌నగర్‌లోని బ్యాంక్ ఆఫ్ బరోడా ఆదర్శనగర్ బ్రాంచి ఆధ్వర్యంలో 116వ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ సీనియర్ చీఫ్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 8వేలకు పైగా బీఓబీ బ్యాంకులున్నాయని తెలుగు రాష్ట్రాల్లో 400కు పైగా బ్యాంకులున్నాయన్నారు. తమ బ్రాంచిలో ఇప్పటివరకు రూ.166కోట్ల వ్యాపారలావాదేవీలు నిర్వహించామన్నారు. ఈ ఏడాది 200 కోట్ల టర్నోవర్ సాధించేందుకు లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. మేనేజర్ డి.ప్రవీణ్‌కుమార్ అధికారులు హారిక, జయశ్రీ, గీతాంజలి పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘాల ఆత్మీయ శంఖారావానికి ఆహ్వానం


మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న పోచంపల్లి రమణా రావు

నల్లకుంట: హుజూరాబాద్‌లో ఈనెల 23న నిర్వహించ తలపెట్టిన బ్రాహ్మణ సంఘాల ఆత్మీయ శంఖారావానికి హాజరు కావాలని కోరుతూ గురువారం మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నగర మాజీ అధ్యక్షుడు నారపరాజు రాంచందర్ రావును కలిసిన తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి(టీబీఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణా రావు ఆత్మీయ ఆహ్వాన పత్రిక అందజేశారు. టీబీఎస్ఎస్ అధ్యక్షుడు రమణా రావు మాట్లాడుతూ.. బ్రాహ్మణ ఆత్మీయ శంఖారావానికి బ్రాహ్మణులు అధిక సంఖ్యలో హాజరై బ్రాహ్మణుల ఐఖ్యతను చాటాలని పిలుపునిచ్చారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులకు సముచిత స్థానం కల్పిసాం

అంబర్‌పేట: బీఆర్‌ఎస్ పార్టీని అంబర్‌పేట నియోజకవర్గంలో తిరుగులేని శక్తిగా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమపథకాలకు ఆకర్షితులై ప్రధానంగా అంబర్‌పేట నియోజకవర్గంలో ప్రధానంగా బీజేపీ పార్టీ నేతలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే వెల్లడించారు. బీఆర్‌ఎస్‌లో చేరిన ఇతర పార్టీల నాయకులకు సముచిత గౌరవాన్ని ఇస్తామని ఎమ్మెల్యే తెలిపారు. గురువారం ఆయన క్యాంపు కార్యాలయంలో బీజేపీకి చెందిన సీనియర్ నాయకులు బి.రఘురామిరెడ్డి, బ్రహ్మచారిలను అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్‌కుమార్ గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే వారిని పార్టీలోకి ఆహ్వానించి కండువా కప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... బీజేపీ పార్టీ కోసం దశాబ్దాల తర బడి కృషి చేసిన సామాన్య కార్యకర్తలకు ఎలాంటి గుర్తింపు లేదని ఎమ్మెల్యే అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీలోకి ఇప్పటికే అనేకమంది బీజేపీ నేతలు చేరాని మరికొంతమంది చేరబోతున్నారని ఆయన తెలిపారు. పార్టీలో చేరిన వారిలో బీజేపీ నేతలు రమేష్ గౌడ్, లక్ష్మణ్‌రావులు సైతం ఉన్నారు. గెల్వయ్య, లవంగం ఆంజనేయులు, చందు, మహేష్, ఆర్‌కె.బాబు తదితరులు ఉన్నారు.


బీజేపీ నేతలకు బీఆర్‌ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కార్పొరేటర్ దంపతుల హౌస్ అరెస్టు

కాచిగూడ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి గురువారం బాటసింగారంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పరిశీలించేందుకు వెళుతున్నట్లు ప్రకటించడంతో ముందస్తుగా బీజేపీ కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ దంపతులను ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణ రాజు ఆధ్వర్యంలో పోలీసులు వారిని ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా ఉండేందుకు ముందస్తుగా బీజేపీ నేతలను, కార్పొరేటర్‌ను హౌజ్ అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కాచిగూడ, చెప్పల్‌బజార్ ఇందిరానగర్‌లో కార్పొరేటర్ ఇంటి వద్ద పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

శుభాకాంక్షలు



అంబర్‌పేట: రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్‌గా దివంగత ఉద్యమ గాయకుడు సాయిచంద్ సతీమణి వేద రజిని సాయిచంద్‌కు బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు దూసరి శ్రీనివాస్‌గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. గురువారం ఆమె పదవీ చేపట్టిన నేపథ్యంలో పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

బీఆర్‌ఎస్‌లో బీసీ నినాదం.. బీసీ సంక్షేమ సంఘం ఉద్యమ ఫలితమే



ముషీరాబాద్: రాబోయే ఎన్నికల్లో బీసీ ముఖ్యమంత్రితో పాటు బీసీలకు 60 అసెంబ్లీ టికెట్లు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొదటి నుంచి బీసీ సంక్షేమ సంఘం చేపడుతున్న ఆందోళనలు డిమాండ్ల ప్రతిఫలంగానే బీఆర్‌ఎస్‌లోని మంత్రులు, ఎమ్మెల్యేలు సమావేశాన్ని ఏర్పాటు చేయడాన్ని ఆయన గుర్తు చేశారు. తొలిసారి బీసీల పేరుతో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు సమావేశం ఏర్పాటు చేసి రాజ్యాధికారాన్ని బీసీలకు అప్పగించాలని అనడం, బీసీల నినాదం చేపట్టడం శుభసూచికమన్నారు. బీసీ పదాన్ని ఉచ్ఛరించడానికి కూడా ఇష్టపడని ముఖ్యమంత్రి స్వయంగా ఆయనే బీసీల బహిరంగ సమావేశానికి ప్రొత్సహించే స్థితి రావడానికి తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘమే కారణమని ఆయన పేర్కొన్నారు. అంజి, నీల వెంకటేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలో నేరస్తులను కఠినంగా శిక్షించాలి

ముషీరాబాద్: మణిపూర్‌లోని కుకీ తెగల మహిళలపై అత్యంత పాశవిక నేరానికి, అత్యాచారానికి పాల్పడిన దోషులకు కఠినంగా శిక్షించాలని ఐద్వా హైదరాబాద్ సెంట్రల్ సిటి అధ్యక్ష, కార్యదర్శులు పద్మ, కె.నాగలక్ష్మిలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మణిపూర్‌లోని డబుల్ ఇంజిన్ సర్కార్‌లో మహిళల పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయో ఈ ఘటనతో తెలుస్తుందని వారు తెలిపారు. ఘటన జరిగిన రెండు నెలలపైగా అయినా, పోలీసుల ముందే నేరం జరిగినా, నేరస్తులు స్పష్టంగా తెలుస్తున్నా పోలీసులు చర్యలు చేపట్టకుండా చేష్టలుడిగి కూర్చోవడదేనికి నిదర్శనమని వారు ప్రశ్నించారు. హింసతో, మారణకాండతో, అత్యాచారాలతో అట్టుడుకుతున్న మణిపూర్‌పై ప్రధాని మౌనం వహించడం ఏమిటని వారు ప్రశ్నించారు. మణిపూర్ ఘటనపై ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారించి నేరస్తులందరిని కఠినంగా శిక్షించి మణిపూర్‌లో శాంతిభద్రతలను పునరుద్దరించాలని డిమాండ్ చేశారు.

కార్పొరేటర్ గృహ నిర్బంధం

చిక్కడపల్లి : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో తలపెట్టిన బాటసింగారంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లపరిశీలన కార్యక్రమాన్ని బయలుదేరకుండా గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్, బీజేవైఎం నగర పూర్వ అధ్యక్షులు ఎ.వినయ్‌కుమార్‌లను వారి నివాసంలో ముషీరాబాద్ సీఐ జాంగీర్‌యాదవ్ గురువారం గృహనిర్బంధం చేశారు. ఈ చర్యలు కేసీఆర్ నియంత పాలనకు నిదర్శనమని కార్పొరేటర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

అభినందన


కాచిగూడ ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణ రాజును అభినందిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

కాచిగూడ: బోనాల వేడుకలను శాంతియుత వాతావరణంలో ఘనంగా నిర్వహించుకునేందుకు పూర్తి స్థాయిలో సహకరించిన కాచిగూడ పోలీసులను బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు దిడ్డి రాంబాబు, దాత్రిక్ నాగేందర్ బాబ్జీల ఆధ్వర్యంలో గురువారం పార్టీ నేతలు, కార్యకర్తలు అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణ రాజు, ఎస్ఐలు సురేష్ కుమార్, మల్లయ్య, నరేష్, బీఆర్‌ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

మోదీ సర్కారు అంతానికే ‘ఇండియా’ ఏర్పాటు

కవాడిగూడ: ఆమ్ ఆద్మీ పార్టీతో సహా దేశంలోని 26 లౌకిక రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసిన ఐఎన్‌డిఐఏ(ఇండియా) కూటమి ఆగమనం మోదీ సర్కార్ అంతానికే అని ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అన్నారు. నిరంకుశ ఎన్‌డిఏను ఎదుర్కొవడానికి 26 ప్రతిపక్ష పార్టీలు 2024 లోక్‌సభ ఎన్నికలలో తమ ప్రచారానికి కూటమిను ఏర్పాటు చేయడం మైలురాయి నిర్ణయం అని అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ దుశ్చర్యలను అరికట్టడానికి, మత తత్వం పేరుతో దేశభక్తి ముసుగులో దేశాన్ని ముక్కలు చేస్తూ, ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దెదింపడానికి ఇండియా కూటమి పోరాడుతుందని వెల్లడించారు.

నిరుపేదలకు నిత్యావసర వస్తువుల పంపిణీ



సాక్షి, సిటీబ్యూరో : బ్యాంక్ ఆఫ్ బరోడా 116వ వార్షికోత్సవం సందర్భంగా తిలక్ నగర్ పరిసర ప్రాంతాలలో నివాసమున్న నిరుపేదలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. బ్యాంక్ జోనల్ ఆస్తి వసూళ్ల శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రవీంద్రనాథ్ ఠాగూర్, చీఫ్ మేనేజర్ శ్రీపాద అనూరాధ, సీఎస్ దీపక్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ హయాంలో బీసీలకు తీరని అన్యాయం


మాట్లాడుతున్న దుండ్ర కుమారస్వామి

కాచిగూడ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 9 ఏండ్ల పాలనలో బీసీలకు తీరని అన్యాయం చేసిందని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి విమర్శించారు. ప్రధాని బీసీ అయినా ఎలాంటి మేలు జరగడం లేదని ఆయన ఆరోపించారు. గురువారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ బీసీ కులగణనపై ప్రధాని మోదీ తన వైఖరిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఓబీసీ నినాదాన్ని అడ్డం పెట్టుకుని అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం బీసీలకు చేసింది ఏమి లేదన్నారు. బీసీ కులగణన చేయకుండా బీసీలకు కేంద్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందని ఆరోపించారు.

క్రైం కార్నర్..

కారు ఢీకొని పారిశుద్ధ్య కార్మికురాలికి గాయాలు



చిక్కడపల్లి: చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయం ముందు గురువారం మధ్యాహ్నం గుర్తు తెలియని కారు నడుచుకుంటు వెళ్తున్న పారిశుద్ధ్య కార్మికురాలు కవితను ఢీకొట్టింది. దీంతో ఆమెకు కడుపు భాగంలో గాయాలు అయ్యాయి. తోటి కార్మికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే అక్కడికి చేరుకుని వైద్యసేవలను అందించారు. అనంతరం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కారును స్థానిక యువకులకు ఆపే ప్రయత్నం చేసినా కారు డ్రైవర్ ఆపకుండా తప్పించుకున్నారని వారు తెలిపారు.

గృహిణి అదృశ్యం


ప్రియాంక (ఫైల్)

అంబర్‌పేట: గృహిణి అదృశ్యమైన ఘటన గురువారం అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ అశోక్ కథనం ప్రకారం.. గోల్నాక జైస్వాల్ గార్డెన్‌లో నివసించి యాగంటి రామకృష్ణ, యాగంటి ప్రియాంక (28) దంపతులు. వీరికి మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. కాగా ఈ నెల 19న ప్రియాంక ఉదయం 10 గంటలకు వరుసకు అత్త అయిన విజయలక్ష్మీతో బ్యాంకుకు వెళ్తానని ఇంట్లో చెప్పి వెళ్లింది. అనంతరం ప్రియాంక బ్యాంక్‌కు వెళ్లకుండా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది ఆయా ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బర్కత్‌పుర హౌసింగ్ బోర్డు కాలనీ పార్కు బోర్డు మార్చాలి

కాచిగూడ: బర్కత్‌పుర హౌసింగ్ బోర్డు కాలనీలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ రూ.1.50 కోట్ల నిధులతో పార్కును సుందరంగా, అందరికి ఉపయోగపడే విధంగా జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ ద్వారా తీర్చిదిద్దారని బర్కత్‌పుర హౌసింగ్ బోర్డు ఎల్ఐజిహెచ్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు వివేక్ ఆనంద్, పాడిశెట్టి కిషోర్, ఎన్.శరత్ శ్యామ్ తెలిపారు. పార్కును త్వరలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతుండగా పార్కు వద్ద బర్కత్‌పుర హౌసింగ్ బోర్డు కాలనీ అండ్ పార్కు వాకర్స్ అసోసియేషన్ పేరుతో బోర్డును అధికారులు ఏర్పాటు చేశారు. దీంతో కాలనీ పార్కుకు వాకర్స్‌కు ఏంటి సంబంధం అంటూ వాకర్స్ పేరు కాలనీ పార్కు బోర్డు పై ఎలా చేర్చుతారని కాలనీ వాసులు ప్రశ్నిస్తున్నారు. వాకర్స్ అసోసియేషన్ పేరుతో నూతనంగా ఏర్పాటు చేసిన బోర్డును వెంటనే తొలగించి బర్కత్‌పుర హౌసింగ్ బోర్డు కాలనీ పార్కుగా మాత్రమే పేరు పెట్టాలని కోరుతూ గురువారం కాలనీ ప్రతినిధులు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు.


ఎమ్మెల్యేకు వినతి పత్రం సమర్పిస్తున్న వివేక్ ఆనంద్, శరత్ శ్యామ్, పాడిశెట్టి కిషోర్


ఫీవర్ చౌరస్తా వద్ద బీజేపీ నిరసన


నిరసన తెలియజేస్తున్న బీజేపీ నాయకులు

నల్లకుంట: విదేశీ పర్యటన ముగించుకొని ఢిల్లీ నుంచి హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్ పోర్టుకు వచ్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి.. తన కాన్వాయ్‌తో చలో బాటసింగారం బయలు దేరారు. ఆయనను శంషాబాద్ ఓఆర్ఆర్ వద్ద అడ్డుకున్న పోలీసులు అరెస్టు చేయడంపై బీజేపీ శ్రేణులు భగ్గుమన్నాయి, ఈ మేరకు గురువారం నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి చౌరస్తాలో బీజేపీ నాయకులు నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపీ నల్లకుంట డివిజన్ అధ్యక్షుడు రమణా నాయుడు, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు వనం రమేష్, ఓబీసీ మోర్చా కార్యదర్శి ఎంబీ.కిశోర్ పాల్గొన్నారు.

కాచిగూడలో బీజేపీ ధర్నా

కాచిగూడ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డిని తెలంగాణ ప్రభుత్వం, పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేసినందుకు నిరసనగా గురువారం పార్టీ అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు కాచిగూడ డివిజన్ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ నేతలు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు కన్నె రమేష్‌యాదవ్, బి.భీమ్‌రాజ్, ప్రతిభ, మల్లికార్జున్, శీర్‌సాగర్, వాసు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


కాచిగూడలో ధర్నా చేస్తున్న బీజేపీ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్